క్లుప్తంగా

నేటి నుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు


రాళ్లగూడుపల్లిలో పూజలందుకుంటున్న రామ లింగేశ్వరస్వామి

మోమిన్‌పేట: మండల పరిధిలోని రాళ్లగూడుపల్లిలో వెలసిన రామ లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు మల్లేశం స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు ఉదయం అభిషేకం, హారతి, తీర్థ ప్రసాదాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యా బోధన చేపట్టాలి

ఎంఈఓ రాంరెడ్డి


మాట్లాడుతున్న రాంరెడ్డి

కొడంగల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేపట్టాలని ఎంఈఓ రాంరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు గురువారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, స్కూల్ దుస్తులు, ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్, టీఎల్ఎమ్, ఇతర కార్యక్రమాల గురించి చర్చించారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు హాజరు కావాలని, ప్రతిరోజు తప్పనిసరిగా ప్రార్థన చేయించాలని సూచించారు.

బెల్కటూర్ బ్రిడ్జి వద్ద మరమ్మతులు

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో పనులు
- కొనసాగుతున్న రాకపోకలు


డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు పనులు చేపడుతున్న సిబ్బంది

తాండూరు రూరల్: బెల్కటూర్ గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల సందర్భంగా వాగులో డైవర్షన్ రోడ్డు నిర్మించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి అది కోట్టుకపోయింది. దీంతో ఆ మార్గంలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గురువారం ఆర్అండ్‌బీ అధికారులను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీనికి స్పందించిన అధికారులు ఏఈ శ్రవణ్‌కుమార్ పర్యవేక్షణలో డైవర్షన్ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అనంతరం తాండూరు–కరన్‌కోట్‌కు రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి పలు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో బరిలో ఉండాలి


మన్నెగూడలో నిర్వహించిన సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

పూడూరు: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీ నుంచి బీజేపీ అభ్యర్థులు బరిలో ఉండాలని తెలంగాణా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మిట్ట పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని మన్నెగూడలో ముఖ్య నాయకులతో కలిసి ఎన్నికల కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమరానికి ప్రతీ ఒక్కరు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మదర్సాను నిర్మిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవలని ఎంపీడీఓ పాండుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సినిమా సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, అనిల్, మండల ప్రధాన కార్యదర్శి క్రిష్టాచారి, నాయకులు సుభాన్, మనోహర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో ధీమా

- ఉపాధి హామీ కూలీలు సంవత్సరానికి రూ. 20 చెల్లించేవిధంగా ఒప్పందం
- ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆదుకునేందుకు ఇన్సూరెన్స్
- రూ.2లక్షల వరకు వర్తింపు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దౌల్తాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి స్థానికంగా పనులు కల్పించేందుకు అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. జాబ్‌కార్డు ఉన్న ప్రతీఒక్కరికి 100 రోజులపాటు పనులు కల్పిస్తోంది. ఉపాధి పనులు కల్పించడంతో పాటు పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు ఏదైనా సంభవిస్తే ఆదుకునేందుకు బీమా సౌకర్యం సైతం కల్పించింది. దీంతో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు ఈ పథకంతో ధీమాగా ఉండొచ్చని చెబుతున్నారు.

పీఎంఎస్‌బీవై ద్వారా అమలు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ కూలీలకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా ఈ సౌకర్యం కల్పిస్తుంది. ఈ పథకంలో ఉపాధి కూలీగా ఉండి 18నుంచి 70 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులుగా నిర్ణయించారు. కూలీ సంబంధిత జాతీయ బ్యాంకుతో బీమా చేయించుకునేందుకు అంగీకారం కుదుర్చుకుని ప్రతి సంవత్సరం రూ.20 ప్రీమియం చెల్లించేవిధంగా ఒప్పందం కుదుర్చుకుంది.

గాయాల బారిన పడితే..

ఉపాధి హామీలో పనిచేసే కూలీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఉపాధి హామీ పనులు చేసే సమయంలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవిస్తాయి. ఈ క్రమంలో గాయాల పాలై మృత్యువాత కూడా పడిన సందర్భాలు ఉన్నాయి. బీమా ప్రీమియం చెల్లించిన వారికి ప్రమాదవశాత్తు గాయాలై పనిచేయని స్థితిలో ఉన్న వారికి రూ.1లక్ష మృత్యువాత పడితే రూ. 2లక్షలు క్లెయిమ్ వర్తింపజేస్తారు.

ఉపాధి పనులపై ఆసక్తి

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉపాధి హామీ పనులను మహిళలే అధికంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో ఇతర పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు డిమాండ్ ఉంటుంది. రైతు సంక్షేమం కోసం చేపట్టే పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వాలు కూలి రేట్లను పెంచుతున్నాయి. ప్రస్తుతం ఒక రోజుకు రూ.307లు చెల్లిస్తున్నారు. మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉండగా యాక్టివ్ జాబ్‌కార్డులు 7,936 ఉన్నాయి. ఇందులో 12వేల మంది కూలీలు ఉన్నారు. వారందరు కూడా లబ్ధి పొందే అవకాశం ఉంది.

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి


అంతారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్: స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతోనే తాండూరు అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. తాండూరు మండలం అంతారంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడత బిల్లు రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తాండూరు నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు కరెంట్ ఫ్రీ, వంటి సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, నాయకులు ఉదయ్ భాస్కర్‌రెడ్డి, పెంద్యా నర్సిములు, హరీశ్వర్‌రెడ్డి, జగదీష్, జే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు నాణ్యతగా చేపట్టాలి

- నిర్మాణ పనులు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


బురాన్‌పూర్-మదన్‌పల్లి రోడ్డు పనులు పరిశీలిస్తున్న పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని బురాన్‌పూర్–మదన్‌పల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్డు, వంతెన నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాని సూచించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని త్వరగా పూర్తి చేయాలన్నారు.

దీప్లానాయక్ కుటుంబానికి పరామర్శ

సూర్యానాయక్ తండాలో ఇటీవల గుండెపోటుతో మరణించిన పార్టీ కార్యకర్త దీప్లానాయక్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, యాదగిరి, నెహ్రూనాయక్, నర్సింహానాయక్, హీర్యానాయక్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

బంట్వారం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్ఐ శైలజ పేర్కొన్నారు. గురువారం ఆమె మండలంలోని పలు వాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారుతున్న వాగులను దాటే ప్రయత్నం చేయొదన్నారు. వరద ఉధృతి తగ్గిన తర్వాతే వెళ్లాలని సూచించారు. అంతేకాకుండా ప్రమాదకరంగా ఉండే విద్యుత్ స్తంభాలు, సపోర్ట్ వైర్లను ముట్టుకోవద్దన్నారు. శిథిలావస్థలోని పురాతన ఇళ్లలో నివసించే కుటుంబాలను ఖాళీ చేయించాలన్నారు. ఇందుకు సంబంధించి గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- పీహెచ్‌సీ వైద్యాధికారి రుబియానాజ్


గిరిజాపూర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాలాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రుబియానాజ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గిరిజాపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో వరదనీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 60 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయ సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ శోభ, ఎంఎల్‌హెచ్‌పీలు వైష్ణవి, తుల్జారాం, ఏఎన్ఎంలు పుణ్యవతి, వనిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

దుద్యాల్: స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు స్వేచ్ఛగా పంటలు పండించుకుంటున్నారంటే అది బీఆర్ఎస్ పుణ్యమేనని గుర్తు చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత తమ పార్టీకే చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, యువజన నాయకులు నరేశ్ గౌడ్, సురేశ్ రాజ్, శ్రీనివాస్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

పూడూరు: మండలంలో యూరియా కొరత లేదని సరిపడా ఎరువులు ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎస్ఐ భరత్‌రెడ్డి, ఏఓ తులసిరాం తదితరులు మండల కేంద్రంలో యూరియా నిల్వ గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు అవసరానికి మించి యూరియాను నిల్వ చేసుకోవద్దని సూచించారు. యూరియా మోతాదులో వాడితే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ అధికారి తులిసిరాం తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీఆర్ఎస్ మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి
- యాలాలలో మండల కార్యకర్తల సమావేశం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైల్‌రెడ్డి

యాలాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం యాలాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ పార్టీపై విమర్శలకే ఎక్కువ సమయం కేటాయిస్తుందని విమర్శించారు. గత 20 నెలల్లో తాండూరు అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిందేమి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సూచించిన వ్యక్తినే ఎన్నికల్లో పోటీ చేయిస్తామన్నారు. ఈ విషయంలో కార్యకర్తల నిర్ణయమే ఫైనల్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ఈజీఎస్ స్టేట్ మాజీ సభ్యుడు శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ రమేశ్, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, నాయకులు క్రిష్ణకుమార్, శరణుభూపాల్, మంత్రి వెంకటయ్య, రఘు, రాజు నాయక్, రవికుమార్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి ఒక్కరూ చేరలేదు

- పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం


మాట్లాడుతున్న వెంకటేశం

బంట్వారం: కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా బీఆర్ఎస్‌లో చేరలేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం పేర్కొన్నారు. గురువారం బంట్వారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో బంట్వారం మండలం నుంచి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా చేరలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఇతర పార్టీల నాయకులు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకే చేరుతున్నారని ఆయన వివరించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపుకోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు, నాయకులు అంజిరెడ్డి, గిరిదాస్, సిద్ధిరాములు, ముజీబ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి


పరీక్షలు చేయించుకుంటున్న సిబ్బంది

అనంతగిరి: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై తప్పనిసరిగా శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ సిబ్బందికి ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యే సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికపుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

- ఎంపీడీఓ నర్సింహులు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి
- కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం తనిఖీ


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అధికారులు

ధారూరు: ప్రతీరోజు మెనూప్రకారం భోజనం వడ్డించాలని ఎంపీడీఓ నర్సింహులు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం పేర్కొన్నారు. ధారూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అక్కడ పరిసరాలను, నిల్వ ఉన్న బియ్యం, కూరగాయలు, ఇతర సామగ్రి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు పౌష్టికాహారం వండి పెట్టాలని నిర్వాహకులతో చెప్పారు. వానాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ వ్యక్తి గత శుభ్రత పాటించాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రత్నం

నవాబుపేట: ఉపాధ్యాయ ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, విద్యారంగ సమస్యలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ బుచ్చయ్యకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రత్నం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలను సవరించి 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచరు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జిల్లాలకు శానిటేషన్ గ్రాంట్లు విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లా నాయకులు వెంకటయ్య, శశిధర్, కృష్ణయ్య, సి వెంకటయ్య, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

కుల్కచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్ యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మనోహర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దీర్ఘకాలంగా పెండింగ్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీపీఎస్ రద్దు చేయాలి

బొంరాస్‌పేట: దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ విధానం రద్దుచేసి, ఓపీఎస్ విధానం కొనసాగించాలని కోరారు.


నవాబుపేట: తహసీల్దార్ బుచ్చయ్యకు వినతిపత్రం ఇస్తున్న వెంకటరత్నం తదితరులు


కుల్కచర్ల: తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి యూటీఎఫ్ నాయకుల వినతి

సమస్యల పరిష్కారానికి కృషి

పరిగి: కాలనీల్లో సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మాజీ కౌన్సిలర్ రవికుమార్ పేర్కొన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణ కేంద్రంలోని కేబీఎస్ కాలనీ, రెండు వార్డుల్లో నీరు చేరడంతో, రోడ్లన్ని బురదమయంగా మారాయి. గురువారం రవికుమార్ అక్కడికి వెళ్లి జేసీబీ సాయంతో నీటిని తొలగింపజేశారు. రోడ్లపై మొరం వేయించారని పేర్కొన్నారు.

మున్సిపాలిటీ లేనట్లే!

- పెరుగుతున్న జనాభా
- వనరులు పుష్కలం
- పట్టించుకోని అధికారులు


మోమిన్‌పేట గ్రామం

మోమిన్‌పేట: ఆరు నెలల క్రితం మండల కేంద్రం మోమిన్‌పేట మున్సిపాలిటీగా మారనుందా? అని అడిగితే అవుననే పేర్కొన్నారు. అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీకి అన్ని అర్హతలు ఉన్నాయని అంటున్నారు. అదే జరిగితే మరింత వేగంగా అభివృద్ధి చెందనుందని పలువురు మేధావులు పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఏర్పడటం పట్ల కొంత మందికి మోదం..ఇంకొంత మందికి ఖేదంగా మారింది. కాని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్న దృష్ట్యా జిల్లా పరిషత్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీల జాబితాను విడుదల చేసింది. గతంలో ఉన్న 12 ఎంపీటీసీ స్థానాలనే మళ్లీ ఇప్పుడు ప్రకటించారు. దీని వల్ల ఇప్పటికి మోమిన్‌పేట ప్రభుత్వం మున్సిపాలిటీగా ప్రకటించే యోచన లేదని తేలిపోయింది. ఒక వేళ ఏ మాత్రం అవకాశం ఉన్న ఎంపీటీసీ స్థానాలను తగ్గించి ప్రకటించేది. మోమిన్‌పేట చుట్టూ పారిశ్రామిక వాడలు ఏర్పడటంతో గ్రామ జనాభా నానాటికి పెరుగుతుంది. మోమిన్‌పేటలో సుమారుగా 100ఎకరాల్లో నూతన వెంచర్ల ఏర్పాటుతో గ్రామ విస్తీర్ణం 10చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రోజురోజుకు పట్టణీకరణ వేగంగా విస్తరిస్తుంది. గ్రామంలో ఆర్అండ్‌బీ రెండు కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వ్యాపార వనరులు పుష్కలంగా పెరిగాయి. నేడు మోమిన్‌పేటలో దొరకని వస్తువంటూ ఏది లేదని పలువురు వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. గతంలో కూడా మోమిన్‌పేట పెద్ద వ్యాపార కేంద్రంగానే విరజిల్లిందని గ్రామ పెద్దలు, పూర్వీకుల ద్వారా తెలిసింది. ఇక్కడ పట్టణ ఓటర్లు 6,947మంది ఉండగా, జనాభా మాత్రం 10వేలకు పైగానే ఉంటుంది. మోమిన్‌పేట గ్రామానికి చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ మున్సిపాలీగా రూపాంతరం చెందేలా చర్యలు తీసుకోనున్నారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని చంద్రాయన్‌పల్లి 901మంది ఓటర్లు, రావుల పల్లి 420, బూరుగుపల్లి 903, కాస్లబాదు 589, గోవిందాపూర్ 834, మొరంగపల్లి 2,033మంది, ఎన్కేపల్లి 1,094మంది ఓటర్లు ఉన్నారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని 7గ్రామ పంచాయతీలను విలీనం చేస్తే 13,319మంది ఓటర్లే ఉంటారు. 10 సంవత్సరాల నుంచి హైదరాబాద్ సమీపంలో ఉండటం వల్ల రియల్ వ్యాపారం జోరుగా సాగింది. దీని వలన గ్రామ అభివృద్ధి వేగంగా పుంజుకొంది. ఎస్‌టీఓ, ఎక్సైయిజ్, సివిల్ సీవ కార్యాలయాలతో పాటు సివిల్ సప్‌లై గోదాం కూడా ఇక్కడే ఉండేవి.